
సాక్షి
పల్నాడు
మంగళవారం । 3 । అక్టోబర్ । 2023



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయనగరం జిల్లాకు చెందిన భక్తులు సోమవారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 4513 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 2340 క్యూసెక్కులు విడుదల చేశారు.

ప్రత్యేక అలంకరణలో గణపతి



పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులో ఉన్న నాగులు గుడి దేవస్థానంలో గణపతిని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనార్థం ఉంచారు. భక్తులు స్వామివారిని దర్శించుకొన్నారు.

న్యూస్‌రీల్

మహాత్ముని ఆశయాలకు పునరంకితం కావాలి

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



గుంటూరు ఎడ్యుకేషన్: జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాల సాధనకు పునరంకితం కావాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. సోమవారం మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి జయంతి సందర్భంగా జెడ్పీ సమావేశ మందిరంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెనీ క్రిస్టినా మాట్లాడుతూ మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి భారతదేశానికి గర్వకారణమని అన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖ పాత్ర పోషించారని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ, అకౌంట్స్ అధికారి శ్రీనివాసరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అమరావతి గుడికి బస్సు సర్వీసు పునరుద్ధరణ



అమరావతి: అమరావతి వచ్చే భక్తులు, పర్యాటకుల సౌకర్యార్థం గుంటూరు నుంచి అమరావతి అమరేశ్వరస్వామి గుడి వరకు ఏపీఎస్ ఆర్టీసీ బస్సు సర్వీసులను పునద్ధరించినట్లు గుంటూరు-1 డిపో మేనేజర్ రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం అమరావతి గుడి వద్ద నుంచి గుంటూరుకు ప్రతి అరగంటకు సర్వీసు నడుపుతున్నామన్నారు. దుర్గావిలాస్‌సెంటర్ నుంచి గుంటూరుకు ప్రతి 15నిముషాలకు ఓ సర్వీసు నడుపుతున్నామని తెలిపారు. అమరావతి గుడి నుంచి ఏడు సర్వీసులు, క్రోసూరు నుంచి మరో 10 సర్వీసులతో పాటు అచ్చంపేటకు ఒక సర్వీసుతో కలుపుకుని మొత్తం 18 సర్వీసులు నడుపుతున్నామన్నారు.

లడ్డూ ధర రూ.ఏడు లక్షలు



పాత గుంటూరు విద్యానగర్‌లోని వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణనాథుని ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. విశేష పూజలు అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం వినాయకుని లడ్డూ వేలం నిర్వహించగా కొల్లి అరవింద్ కుమార్ రూ. 7.02 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొల్లి బాలకృష్ణ, పుల్లెల అజయ్‌బాబు, తోట సాంబశివరావు, ఆరుమళ్ల నాగిరెడ్డి, బి.నాగిరెడ్డి, ఆళ్ల వెంకటరెడ్డి, శివకోటిరెడ్డి, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆంధ్ర సెంట్రల్ జోన్ అంతర్ జిల్లా క్రికెట్ పోటీలు

నరసరావుపేట: స్థానిక ఎస్‌కేఆర్‌బీఆర్ కళాశాలలోని ఏసీఏ క్రికెట్ గ్రౌండ్‌లో మంగళవారం నుంచి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 23ఏళ్లలోపు బాలురకు ఆంధ్ర సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు ప్రారంభమౌతాయని క్రికెట్ గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ పోటీల్లో పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల జట్లు పాల్గొంటాయన్నారు.

నేటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

పెడన: ఉమ్మడి కృష్ణా జిల్లాలో సమగ్ర శిక్ష ద్వారా ఐఈఆర్‌పీకి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసిన అభ్యర్థుల్లో ఎంపికైన వారి జాబితాలను ఆన్‌లైన్‌లో ఉంచామని సమగ్ర శిక్ష ఏపీసీ ముదిగొండ ఫణిదూర్జటీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ జాబితా ప్రకారం అభ్యర్థుల సర్టిఫికెట్లను మంగళవారం నుంచి పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఎంఆర్ కేటగిరీలోని 96 మంది సర్టిఫికెట్లను మంగళవారం, హెచ్ఐ/వీఐ కేటగిరీలో 77 మందివి బుధవారం మచిలీపట్నం డీఈఓ కార్యాలయంలో పరిశీలిస్తామని తెలిపారు. ఆయా రోజుల్లో ఉదయం పది గంటల నుంచి జరిగే ఈ సర్టిఫికెట్ల పరిశీలనకు అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్లు జిరాక్స్ అటెస్టెడ్ చేయించినవి తీసుకురావాలని సూచించారు.

నరసరావుపేట వన్‌టౌన్ పరిధిలో ఈ ఏడాది మే మొదటి వారంలో ఐదు రోజుల్లో వరుసగా మూడు హత్యలు చోటుచేసుకోవటంతో పోలీసుశాఖ ఉలికిపాటుకు గురైంది. చనిపోయిన ముగ్గురు యాచకులు కావడం, అర్ధరాత్రి హత్యలు జరగడం, వారికి ప్రత్యర్థులు ఎవరూ లేకపోవడంతో నిందితుడిని గుర్తించడం కష్టమైంది. హత్య జరిగిన దుకాణాల వద్ద సీసీ ఫుటేజ్ పరిశీలించగా మూడు హత్యలను శివసంజీవయ్య కాలనీకి చెందిన పాత నేరస్తుడు తన్నీరు అంకమ్మరావు ఉరఫ్ ముళ్లపంది చేసినట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నేరస్తుడిని గుర్తించడం ఆలస్యమై ఉంటే మరిన్ని ప్రాణాలు ఈ సైకో చేతిలో బలైపోయేవని పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు.

నకరికల్లు ఇందిరమ్మకాలనీలో నివాసం ఉండే షేక్ జైనబ్ కుటుంబం గత నెల 5వ తేదీన పని నిమిత్తం నరసరావుపేటకు వెళ్లగా, దొంగలు తాళాలు పగలగొట్టి 150.696 గ్రాముల బంగారం, రూ.7.50 లక్షల నగదును అపహరించారు. సీసీ కెమెరాలను పరిశీలించగా ఓ దొంగ నడక ఆధారంగా ముగ్గురు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరు ఈ ఏడాదిలో ఏడు దొంగతనాల్లో రూ.24.5 లక్షల విలువైన బంగారం, నగదును దొంగిలించినట్టు గుర్తించి, వారిని నుంచి సొమ్మును రికవరీ చేశారు.

ఇలా ఎన్నో కేసులను పోలీసులు ఛేదించడానికి సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

పనిలో పనిఘా.. ఛేదన వడిగా!

సీసీ కెమెరాల ఏర్పాటుతో జిల్లాలో పెరిగిన నిఘా

- ముఖ్యమైన కూడళ్లతో పాటు గ్రామాల్లో సైతం ఏర్పాటు చేస్తున్న పోలీసులు
- జిల్లా ఏర్పడినప్పటి నుంచి 522 చోట్ల అందుబాటులోకి వచ్చిన 1,530 కెమెరాలు
- ప్రైవేట్ కార్యాలయాలు, వ్యాపారులతో కలిసి వేలాది నిఘా నేత్రాలు ఏర్పాటు
- సీపీ కెమెరాల ద్వారా 22 కీలక కేసులు ఛేధించిన పల్నాడు పోలీసులు
- నేర పరిశోధన, నియంత్రణలో కీలకమన్న ఎస్పీ రవిశంకర్ రెడ్డి



నరసరావుపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కంట్రోల్ రూంను ప్రారంభిస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి (ఫైల్)

సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లాను నిఘా నీడలోకి తెచ్చేందుకు జిల్లా పోలీసు శాఖ ముమ్మరంగా ప్రయత్నిస్తోంది. అందుకోసం జాతీయ రహదారులు మొదలు గ్రామీణ రోడ్ల వరకు, పట్టణాలు నుంచి పంచాయతీల దాకా ఎక్కడికక్కడ సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటిని నేరుగా స్థానిక పోలీస్‌స్టేషన్లు, జిల్లా కమాండ్ కంట్రోల్ రూంలకు అనుసంధానం చేశారు. దీంతో నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక భూమిక పోషిస్తున్నాయి. ద్యాప్తులో భాగంగా సాక్ష్యాధారాల సేకరణ, నిందితులను పట్టుకోవడంలోనూ కీలకపాత్ర పోషిస్తున్నాయి. దీంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో నేరాలు తక్కువగా నమోదు అవుతున్నాయని, ఒక వేళ జరిగినా నిందితులను వెంటనే పట్టుకోవడానికి వీలవుతోందని పోలీసులు అభిప్రాయపడుతున్నారు. ఏడాది కాలంలో జిల్లాలో 22 కీలకమైన కేసులను పోలీసుల ఛేదించారు అంటే వీటి పనితీరును అర్థం చేసుకోవచ్చు.

జిల్లా ఏర్పాటు తర్వాత 1,530 కెమెరాలు...

పల్నాడు జిల్లా ఏర్పడిన తర్వాత తొలి ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వై.రవిశంకర్‌రెడ్డి జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవడం ప్రారంభించారు. సున్నితమైన ప్రాంతమైన పల్నాడులో సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకతను గుర్తించి ముమ్మరంగా ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాలు, కమాండ్ సెంటర్ల ఏర్పాటు అయ్యేలా చూశారు. 17 నెలల కాలంలోనే జిల్లాలోని 522 కీలక ప్రాంతాల్లో కొత్తగా 1,530 కెమెరాలు అందుబాటులోకి తెచ్చారు. వీటికి అదనంగా ప్రైవేట్ కార్యాలయాలు, వ్యాపార సముదాయాలు, విద్యా సంస్థలు, నివాస సముదాయాల్లో ఆయా యాజమాన్యాలు, స్వచ్ఛంధ సంస్థలతో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొనేలా అవగాహనకల్పించారు. దీంతో నేరాల సంఖ్య తగ్గడంతో పాటు, వెంటనే నిందితులను గుర్తించడం సులభమవుతోంది.

జిల్లా ఏర్పడినప్పటి నుంచి కొత్తగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల సంఖ్య...

నరసరావుపేట	195	516
సత్తెనపల్లి	211	798
గురజాల	116	216
జిల్లా మొత్తం	522	1,530



పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

సీసీ కెమెరాల ఏర్పాటు బాధ్యతగా స్వీకరించాలి

నేర పరిశోధన, నియంత్రణలో సీసీ కెమెరాలు ఎంతో కీలకం. ఈ ఉద్దేశంతో ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సహకారంతో 17 నెలల కాలంలో కొత్తగా 1,530 కెమెరాలను ఏర్పాటు చేశాం. నరసరావుపేట, సత్తెనపల్లి డివిజన్లలో పలు కీలకకేసులను సీసీ కెమెరాల ద్వారా ఛేదించాం. ప్రతి గ్రామంలో కనీసం కీలకమైన ప్రాంతాల్లో వీటి ఏర్పాటుకు పోలీసుశాఖ కృషి చేస్తోంది. గతంలో దొంగతనాల పరిశోధన కొంత ఇబ్బందికరంగా ఉండేది. ఇప్పుడు సీసీ కెమెరాలు ఉన్న ప్రాంతాల్లో చోరీలు తగ్గుముఖం పట్టాయి. దోషులను గుర్తించి, గంటల వ్యవధిలోనే పట్టుకోగలుగుతున్నాం.

– వై. రవిశంకర్‌రెడ్డి, పల్నాడు జిల్లా ఎస్పీ

గాంధీజీ స్ఫూర్తిగా నూతన సంకల్పం

జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్



గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ శివశంకర్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ

నరసరావుపేట: జాతిపిత మహాత్మా గాంధీ స్ఫూర్తిగా నూతన సంకల్పం తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ, దేశ మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న మహాత్మాగాంధీ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి, అక్కడే లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటానికి పూలు చల్లి ఘన నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ భారత జాతికి మహాత్మా గాంధీజీ గొప్ప స్ఫూర్తి ప్రదాతగా అభివర్ణించారు. లాల్ బహదూర్ శాస్త్రి గొప్ప పరిపాలనా దక్షులని కొనియాడారు.. నైతిక విలువలకు మారు పేరుగా నిలిచారని చెప్పారు. జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ అహింసావాదంతో మానవాళికి నూతన పంథాను చూపించారని అన్నారు. ట్రైనీ కలెక్టర్ ఎం.ఆర్.కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి కె.వి నాయకం, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 525.00 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 855.70 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయానికి జూరాల నుంచి 7,423, రోజా నుంచి 2,264 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

గృహ ప్రవేశాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి

- పేదల పక్కా గృహాలు త్వరితగతిన పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్
- ధూళిపాళ్ల లే అవుట్ పరిశీలన



ధూళిపాళ్ల లే అవుట్‌ను పరిశీలించి సూచనలు చేస్తున్న కలెక్టర్ లోతేటి శివశంకర్

సత్తెనపల్లి: నిరుపేదల పక్కా గృహప్రవేశాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా పండుగలా నిర్వహించాలని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశించారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లలోని జగనన్న లేఔట్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల ఐదో తేదీన ఏకకాలంలో లక్షలాది గృహ నిర్మాణాల ప్రవేశాలు చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని కాకినాడ జిల్లా సామర్లకోటలో ప్రారంభిస్తారన్నారు. పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లలో పక్కా గృహ నిర్మాణాలను ప్రారంభించడం జరుగుతుందన్నారు. చురుగ్గా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. మొత్తం 1,150 గృహాలు మంజూరు కాగా 330 గృహాలు పూర్తి చేశామని, 650 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయని గృహ నిర్మాణ శాఖ పీడీ వేణుగోపాలరావు వివరించారు. వీటితోపాటు రూ. 10 లక్షలతో నిర్మిస్తున్న ఆర్బీ, రూ.1.83 కోట్లతో నిర్మిస్తున్న రహదారి పనులను వేగవంతం చేయాలన్నారు. మిగిలిపోయిన ఇళ్లను కూడా త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు. అంతే కాక ప్రతి ఇంటికి ఇంకుడు గుంత కార్యక్రమాన్ని కూడా చేపట్టినట్లు అధికారులు వివరించారు. గృహ ప్రవేశాలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తయి పండుగలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించేలా చూడాలన్నారు. లేఔట్‌లో కలియ తిరిగి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాయపాటి పురుషోత్తమరావు, ధూళిపాళ్ల ది ఆంధ్ర బ్యాంక్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ నల్లబోతు శివన్నారాయణ, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు చిలక జైపాల్, గృహ నిర్మాణ శాఖ డీఈ శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ, తహసీల్దార్ ఎస్. సురేష్, గృహ నిర్మాణ శాఖ ఏఈ సుబ్బారావు, సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి ఫార్మేటివ్ –2 పరీక్షలు

- ప్రధానోపాధ్యాయుల ఈ–మెయిల్స్‌కు ప్రశ్నపత్రం
- నిర్వహణ ఏర్పాట్లలో జిల్లా విద్యాశాఖ యంత్రాంగం



తరగతి గదిలో విద్యార్థులు

సత్తెనపల్లి: విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను వెలికి తీసేందుకు నిర్వహించే ఫార్మేటివ్- 2 పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ సిద్ధమైంది. ఈ నెల 3వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు గత నెల 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు జరిగాయి. ఫార్మేటివ్ -1 పరీక్షను క్లాస్ రూమ్ బెస్డ్ విధానంలో, ఓఎంఆర్ ద్వారా నిర్వహించగా, ఫార్మేటివ్ -2 పరీక్షను పాత విధానంలో జరుపనున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 2,145 ఉన్నాయి. వీటిల్లో 3,06,664 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర విద్యా పరిశోధన మండలి (ఎస్సీఈఆర్టీ) రూపొందించిన ఉమ్మడి పరీక్ష పత్రం ద్వారానే ఫార్మేటివ్ -2 పరీక్ష నిర్వహించేందుకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. ప్రశ్న పత్రాన్ని బ్లాక్ బోర్డుపై ఉపాధ్యాయులు రాస్తారు. విద్యార్థులు చూసి పేపర్‌లో నమోదు చేసుకుని సమాధానాలు రాయాల్సి ఉంటుంది. ఎఫ్‌ఏ-2 పరీక్షకు ప్రింటెడ్ పేపర్ల సరఫరా లేదు. అన్ని మేనేజ్‌మెంట్ల ప్రధానోపాధ్యాయులకు పరీక్ష పేపర్లను మెయిల్‌లో పంపిస్తారు. ఆ పేపర్లను సంబంధిత ప్రధానోపాధ్యాయులు డౌన్‌లోడ్ చేసుకుని పరీక్ష నిర్వహించాల్సి ఉంటుంది.

సమర్థవంతంగా పరీక్షల నిర్వహణ



ఫార్మేటివ్ -1 పరీక్ష నిర్వహించిన మాదిరిగానే ఫార్మేటివ్ -2 పరీక్ష సమర్థవంతంగా నిర్వహించాలి. ఎటువంటి పొరపాట్లకు తావులేని విధంగా పరీక్షలు నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. పరీక్షల నిర్వహణలో ఎక్కడా, ఏవిధమైన పొరపాట్లు తలెత్తినా హెచ్‌ఎంలే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

–ఎ.శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారి, సత్తెనపల్లి

ఘొల్లుమన్న ఎస్సీ కాలనీలు

ఇద్దరు యువకుల దుర్మరణంతో రెండు కుటుంబాల్లో విషాదఛాయలు



కొమ్మతోటి నవీన్ (ఫైల్)



యెహోషువా (ఫైల్)

శావల్యాపురం: మండలంలోని రెండు గ్రామాల ఎస్సీ కాలనీల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. చేతికి అందివచ్చిన బిడ్డలు దూరం కావడాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. వినుకొండ పట్టణంలోని పసువులేరు వాగు వంతెన సమీపాన సోమవారం తెల్లవారుజామున కారు, లారీ ఢీకొన్న సంఘటనలో మండలానికి చెందిన ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. ఈ దుర్ఘటనలో మండలంలోని ముండ్రువారిపాలెం గ్రామ ఎస్సీ కాలనీ వాసి కొమ్మతోటి నవీన్ (23), కనమర్లపూడి గ్రామం ఎస్సీ కాలనీ వాసి కొమ్మతోటి యెహోషువా (23) ఇరువురూ సంఘటనా స్థలంలో మృత్యువాత పడ్డారు.

కొమ్మతోటి పౌలు-పద్మ దంపతులకు ముగ్గురు సంతానం. వారిలో మొదటి వాడు నవీన్ తరువాత ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. కుటుంబ ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఇంటర్‌తో చదువు ముగించి, తండ్రి చేస్తున్న కారు ట్రావెల్స్‌లో పనిచేస్తూ, తండ్రికి చేదోడు-వాదోడు ఉంటూ కుటుంబానికి ఆసరా అయ్యాడు. అలాగే కొమ్మతోటి ఏసు-వజ్రం దంపతులకు ఇద్దరు సంతానం కాగా అందులో మొదటివాడు యెహోషువా. తరువాత మరో ఆడపిల్ల. యెహోషువా కూడా ఇంటర్ వరకే చదివి ఆర్కెస్ట్రాలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తండ్రి ఏసు వ్యవసాయ కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇరు కుటుంబాల్లో ఇంటికి వారసులు మృత్యువాత పడటం అందర్నీ కలచివేసింది. చేతికి అందివచ్చిన కుమారులు విగతజీవులై కనిపించటంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు బంధువులు ఎస్సీ కాలనీవాసులు, శోకసముద్రంలో మునిగిపోయారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3500, గరిష్ట ధర రూ.4800, మోడల్ ధర రూ.4200 వరకు పలికింది.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం



స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా న్యాయమూర్తి

చిలకలపూడి(మచిలీపట్నం): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక సూచించారు. జిల్లా కోర్టు ఆవరణలో సోమవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ భారత్ దివస్ అంశాలకు అనుగుణంగా పరిసరాలను పరిశుభ్రం చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి అరుణసారిక మాట్లాడుతూ.. పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంటే ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. రోగాలు కూడా దూరమవుతాయన్నారు. జడ్జిలు చిన్నంశెట్టి రాజు, ఎ.నరసింహమూర్తి, పి.రామకృష్ణ, కె.వి. రామకృష్ణయ్య, చినబాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తుంగల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వరస సెలవుల నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ సోమవారం కూడా కొనసాగింది. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు, కర్నాటక నుంచి భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు తమ వాహనాలను సీతమ్మవారి పాదాలు, కుమ్మరిపాలెం, పున్నమి ఘాట్, వీఎంసీ కార్యాలయాల వద్ద నిలుపుకొని దేవస్థాన బస్సుల్లో కొండపైకి చేరుకున్నారు. పలువురు భక్తులు కనకదుర్గనగర్ మీదుగా మహా మండపం లిఫ్టు, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్నారు. అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణంలో రద్దీ కనిపించింది. దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు నిర్వహించిన ఆర్జిత సేవల్లో ఉభయదాతలు, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. సర్వ దర్శనానికి రెండు గంటలు, రూ.100, రూ.300, రూ.500 టికెట్ల క్యూలైన్‌లో గంటకు పైగా సమయం పట్టింది. అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు అర్ధగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేయడంతో రద్దీ మరింత పెరిగింది. మధ్యాహ్నం మూడు గంటల వరకు అన్ని క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ, పల్లకీ సేవలోనూ భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు):మనుషులు శాకాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని నేషనల్ వెజిటేరియన్ మూవ్‌మెంట్ సంస్థ వ్యవస్థాపకులు శ్రీనివాస్ చెప్పారు. అంతర్జాతీయ అహింసా దినోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం సిద్ధార్థ ఆడిటోరియంలో విజయవాడ వెజిటేరియన్ క్లబ్ ప్రారంభోత్సవం జరిగింది. ముందుగా క్లబ్ సభ్యులు శాకాహారం ప్రాధాన్యం తెలిసేలా సిద్ధార్థ ఆడిటోరియం నుంచి పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల రోడ్డుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు, కరపత్రాల పంపిణీతో పాటుగా మైక్ ద్వారా ప్రచారం చేశారు. అనంతరం సిద్ధార్థ ఆడిటోరియంలో క్లబ్ ప్రారంభ సభ నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రాణుల పట్ల దయ చూపడమే ధర్మమని, వాటిని చంపడం మహా పాపమని గౌతమ బుద్ధుడు చెప్పాడన్నారు. మనిషి శరీర నిర్మాణానికి ముఖ్యంగా ప్రొటీన్‌లు, కార్బోహైడ్రేట్‌లు, కొవ్వు పదార్థాలు, లవణాలు అవసరమని శాస్త్రవేత్తలు నిర్ధారించారని తెలిపారు. అవి మాంసాహారంలో కంటే శాకాహారంలో ఎక్కువ శాతంలో ఉంటాయని పేర్కొన్నారు. శాకాహారులుగా మారి ఆరోగ్యంగా జీవించాలని సూచించారు.



జగనన్న శాశ్వత భూహక్కు పత్రాలు పంపిణీ


వడ్లమూడివారిపాలెంలో రైతుకు భూహక్కు పత్రం అందజేస్తున్న జేసీ శ్యామ్ ప్రసాద్

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల పల్లి, వడ్లమూడివారిపాలెం, మాచవరం గ్రామాల్లో జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సోమవారం పర్యటించారు. వైఎస్సార్ జగనన్నా శాశ్వత భూహక్కు భూరక్ష పథకంలో భాగంగా భూసర్వే పూర్తి చేసుకొని మంజూరైన భూహక్కు పత్రాలను రైతులకు పంపిణీ చేశారు. భూహక్కు పత్రాలు అందుకున్న రైతులతో ఆయన మాట్లాడారు. ఈ గ్రామాల్లోని సచివాలయాల్లో నిర్వహించిన మహాత్మాగాంధీ జయంతి వేడుకల్లో పాల్గొని గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ జి.అంకారావు, డీటీ బాల వెంకటేష్, విప్పర్లపల్లి గ్రామ సర్పంచి గాదె రామిరెడ్డి పాల్గొన్నారు.

ఆదర్శనీయం మహాత్ముడి జీవితం


మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బాపట్ల జిల్లా అడిషనల్ ఎస్పీ మహేష్

బాపట్లటౌన్: మహాత్మాగాంధీ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా అడిషనల్ ఎస్పీ పి.మహేష్ సూచించారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అడిషనల్ ఎస్పీ పి. మహేష్ మాట్లాడుతూ స్వాతంత్య్ర సమరయోధుడు, అహింసావాది జాతిపిత మహాత్మా గాంధీ అహింసనే ఆయుధంగా చేసుకొని బ్రిటీష్ వారిని ఎదిరించి, భారత దేశానికి స్వాతంత్య్రాన్ని తీసుకువచ్చారన్నారు. ప్రపంచ చరిత్రలో గొప్ప వ్యక్తిగా, జాతిపితగా నిలిచారన్నారు. ఉప్పు సత్యాగ్రహం, సహాయ నిరాకరణ ఉద్యమం లాంటి అనేక రకాలైన ఉద్యమాల్లో యావత్ దేశ ప్రజల్లో స్వరాజ్య స్ఫూర్తిని రగిలించారన్నారు. స్వాతంత్ర పోరాటంలో ఆయన చూపిన మార్గం, సేవలు, ఆశయాలను మనమందరం స్మరించుకోవాలన్నారు. మహాత్మాగాంధీ ఆలోచనలు, సంస్కరణలు మన అందరికీ ఎప్పటికీ ఆదర్శప్రాయమన్నారు. నేటి యువత ఆ మహానుభావుడు చూపిన మార్గంలో ముందుకి సాగి నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎండీ హెచ్ ప్రేమ్ కుమార్, ఎస్బీ సీఐ వి.సూర్యనారాయణ, అడ్మిన్ ఆర్ఐ ఎల్.మన్మధరావు, వెల్ఫేర్ ఆర్ఐ బి.శ్రీకాంత్ నాయక్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుభవజ్ఞులైన సూపర్‌వైజర్‌లు, ఆర్టిస్టులు & వాల్ పెయింటర్‌లు కావలెను

ఒక థీమ్‌తో బిల్డింగ్ ముందు భాగమును వాల్ పెయింటింగ్ చేసి వాటిపై లోగోలను వేయటానికి జిల్లాల వారీగా అనుభవజ్ఞులైన వాల్ పెయింటర్‌లు మరియు ఆర్టిస్టులు (బొమ్మలు వేయువారు) కావలెను. (వ్యక్తులుగా లేదా గ్రూపులుగా).
ఆసక్తి కలవారు ఈ నెంబరులో వెంటనే సంప్రదించండి.

9652456789, 9849200077

నవ యువతరం సేవలు ప్రశంసనీయం

జిల్లా కలెక్టర్ శివశంకర్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా కలెక్టర్ శివశంకర్ తదితరులు

నరసరావుపేట: నవ యువతరం ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో నవ యువతరం ఫౌండేషన్ మూడో వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, కళాశాల పాలకవర్గ అధ్యక్షులు కపలవాయి విజయ్‌కుమార్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చైర్మన్ నిర్మల, సీరియల్ నటులు శివ, వెంకటేష్, న్యూస్ యాంకర్ సిరాజ్, ఫౌండేషన్ చైర్మన్ సీహెచ్ సుమలత హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. టెక్ ఐ కాన్ సహకారంతో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఉచిత కంటి శిబిరం, ఆయుర్వేదంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఫౌండేషన్ అధ్వర్యంలో నూతన మహిళ వింగ్‌ను ఏర్పాటు చేసి మహిళలతో ప్రతిజ్ఞ చెయించారు. పాలకవర్గ సమిటీ సభ్యులు బత్తుల మురళి తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయాలు అందరికీ స్ఫూర్తి

జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి


గాంధి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: గాంధీజీ సిద్ధాంతాలు ప్రస్తుత పాలకులు, ప్రజలకు ఎంతో స్ఫూర్తిదాయకమని జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గాంధి జయంతి సోమవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ సత్యం, అహింసా మార్గం అనుసరించినందుకే మనకు 'జాతిపిత' అయ్యారన్నారు. మహాత్ముడి జన్మదినమైన అక్టోబర్ 2ను ఐక్యరాజ్య సమితి 'అంతర్జాతీయ అహింసా దినోత్సవం'గా నిర్వహిస్తోందని చెప్పారు. ఇది భారతీయులకు ఎంతో గర్వకారణమైన అంశమని వెల్లడించారు. ఆయన సిద్ధాంతాలు ప్రపంచ దేశాలకే అనుసరణీయమని, భారతీయులుగా మనం గాంధీజీ నమ్మిన సిద్ధాంతాలను ఆచరించినప్పుడే ఆయన ఆశయాలకు ఒక అర్థం, పరమార్థం ఉంటుందన్నారు. జిల్లా అదనపు ఎస్పీలు ఆర్.రాఘవేంద్ర, ఎస్.కె.చంద్రశేఖర్, డి.రామచంద్ర రాజు, నరసరావుపేట డీఎస్పీ కేవీ మహేష్, ఎస్పీ సీఐ ప్రభాకర్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి


ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డిని సన్మానిస్తున్న బ్రహ్మారెడ్డి తదితరులు

రెంటచింతల: మహానేత వైఎస్సార్ ఆశయ సాధన కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి అంకితభావంతో కష్టపడే వారికి పార్టీలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం వైఎస్సార్ సీపీ రెంటచింతల మండల అధ్యక్షుడిగా ఎన్నికైన గొట్టం బ్రహ్మారెడ్డి తన ఎన్నికకు సహకరించిన ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డిలను ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ మండలంలోని పార్టీ నాయకులను, కార్యకర్తలను, అభిమానులను సమన్వయం చేసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, దుర్గి మార్కెట్ యార్డు డైరెక్టర్ వెన్నా వెంకటేశ్వరరెడ్డి, ఉప సర్పంచి షేక్ హసన్, ఎంపీటీసీ వై.వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు పమ్మి లచ్చిరెడ్డి, ఎ.వెంకటేశ్వరరెడ్డి, సీహెచ్ వెంకటరెడ్డి, పమ్మి శ్రీను, ఎ.బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పాలన వైఎస్ జగన్‌కే సాధ్యం

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- వైఎస్సార్ సీపీలోకి చేరికలు


వైఎస్సార్ సీపీలో చేరిన ఎస్సీ కుటుంబాలతో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పాలన అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. మండలంలోని వేల్పూరు గ్రామానికి చెందిన టీడీపీ ఎస్సీ కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ పార్టీ, ఏ వర్గం అనేది చూడకుండా అందరికి సంక్షేమ పథకాలు అందడంతో చాలా గ్రామాలలో స్వచ్ఛందంగా వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ కుటుంబంలో చేరిన ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అందరం మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహనరెడ్డిని 175 సీట్లతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో తుమ్మల వెంకయ్య, టి. రమేష్, నందిగం ఏసుదానం, ముత్యాల గంగమ్మ, చిలకా అచ్చియ్య, పి.శివాజీ, చిలకా జాన్‌బాబు, పాపారావు, శిఖా అబ్రహం, గంగబాబు, గోపి, ఎన్.విజయరాయలు, ఎన్.సత్యానందం, కాంచన, ముత్యాల నాగయ్య, షేక్ జాన్‌బాషా కుటుంబాలున్నాయి. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ చావల గోపీకృష్ణ, కోట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలకు అడ్డుకట్ట


నిడుముక్కల ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను అడ్డుకుంటున్న రెవెన్యూ, అటవీ శాఖాధికారులు

నిడుముక్కల(తాడికొండ): తాడికొండ మండలం నిడుముక్కలలో ప్రభుత్వ భూమి ఆక్రమణ యత్నాలను రెవెన్యూ, అటవీ శాఖాధికారులు అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు భూములు చదును చేసి గుడిసెలు వేసేందుకు సిద్ధమయ్యారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్రబాబు వెంటనే ఆక్రమణలు నిలిపి వేయించాలని ఆదేశించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఆర్ఐ వంశీకృష్ణ, వీఆర్వో మాల్యాద్రి అటవీ శాఖాధికారులకు సమాచారం అందించి ఆక్రమణదారుల్ని అడ్డుకున్నారు. అనంతరం ఆ భూమి రెవెన్యూ పరిధిలో ఉందా లేక అటవీ శాఖకు చెందిందా ? అనే దానిపై త్వరలో సర్వే నిర్వహించి, హద్దులు వేసి భూమిని సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అటవీ శాఖ డెప్యూటీ రేంజర్ వీరేశలింగం నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలకు విశేషస్పందన

- 1300 మంది విద్యార్థుల హాజరు
- పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహణ


చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, పర్యవేక్షిస్తున్న కన్వీనర్, నాయకులు

నరసరావుపేట: గాంధి జయంతి సందర్భంగా కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన చిత్రలేఖనం పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ పోటీలలో నరసరావుపేట, సత్తెనపల్లి నియోజకవర్గంలోని నరసరావుపేట పురపాలకసంఘం, మండలం, రొంపిచర్ల, నకరికల్లు మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 1300 మందికి పైగా పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలను విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు యు.వి.రామరాజు, విజ్ఞాన కేంద్రం కార్యనిర్వాహక కన్వీనర్ షేక్ మస్తాన్‌వలి, విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు కామినేని రామారావు, డి.శివకుమారి ప్రారంభించారు. పోటీలకు కన్వీనర్ కట్టా కోటేశ్వరరావు వ్యవహరించారు. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు, విద్యార్థులలో పోటీతత్వం అలవర్చేందుకు పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించామని తెలిపారు. 3,4,5 తరగతుల విద్యార్థులను జాతిపిత మహాత్ముని చిత్ర లేఖనం, 6,7,8 తరగతుల విద్యార్థులకు గాంధీ మతసామరస్యం ఉట్టిపడేలా చిత్ర లేఖనం వేయడం, 9,10 తరగతుల విద్యార్థులకు గాంధీజీ గ్రామ స్వరాజ్యం ఉట్టిపడే బొమ్మలు వేయించడం జరిగిందన్నారు. న్యాయ నిర్ణేతలుగా ప్రముఖ ఆర్టిస్టులు జింకా రామారావు, బి.ప్రసాద్, ప్రముఖ చిత్రలేఖన ఉపాధ్యాయులు టి.తిరుమల లక్ష్మి, పల్నాడు కళాక్షేత్రం ట్రెజరర్ అష్రఫ్ అలీ, వేదాంతం రాంబాబు, ధారల నాగేశ్వరరావు వ్యవహరించారు. ఫలితాలను మంగళవారం వెల్లడిస్తామని కన్వీనర్ పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ 10th, ఇంటర్(ఒకేసం॥లో), డిగ్రీ(1-3సం॥లో) BA, BCom, BSc, MA, MCom, MBA, MSc (All Groups) పాస్ గ్యారంటీ శిక్షణ, సంప్ర॥ శ్రీవెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్, 2/11 బ్రాడీపేట, Gnt 8008145999

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో ఇతర ప్రైవేటు సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) సంప్ర॥ 7416484247

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి ఈ రోజు అన్‌లైన్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్ (100% జెన్యూన్) సంప్ర ✆ 945 945 3338

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థ లలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 88024 89999

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థ లలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521

OLD AGE HOME

■ TANMAYEE ఓల్డ్ ఏజ్ హోమ్, విజయవాడ, వృద్ధులు, అనారోగ్యముతో ఉన్న మీ కుటుంబ సభ్యులను మాహోమ్ లో చేర్పండి మా కుటుంబ సభ్యులవలె చూసుకుంటాము. ఫోన్: 8897730222, 7093911010, 8573000987.

WANTED

■ గుంటూరు, లాం మరియు పిడుగురాళ్ళ, కారంపూడిలలో పనిచేయుటకు సెక్యూరిటిగార్డ్స్ కావలెను. 8555852912

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్/ ఫుల్‌టైమ్ గా వర్క్ చేస్తూ 15 వేలు అపైన సంపాదించే అవకాశం. 91777 36926

■ గుంటూరు ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు లేడీ రిసెప్షనిస్ట్, కంప్యూటర్, అకౌంట్స్ చూసుకొనుటకు కేవలం గుంటూరు లోకల్ వారు మాత్రమే కావలెను. ఇంటర్/డిగ్రీ, అటోనగర్. 8099439999

■ గుంటూరు, తెనాలి, చీరాల, సత్తెనపల్లి, నర్సరావుపేట, చిలకలూరిపేట HDFC, AXIS, ICICI బ్యాంకులలో వర్క్ చేయుటకు యువతి/యువకులు కావలెను. జీతం 10,000+ అపైన. 7386879373

■ Male Nursing Staff, డ్రైవర్లు మరియు E-Bikes నందు పనిచేయుటకు సేల్స్ మేనేజర్స్ కావలెను. సంప్ర॥ 9846870090, 8008687038

■ పంజాబ్ నేషనల్ బ్యాంక్ మెట్‌లైఫ్‌లో డిస్ట్రిబ్యూషన్ మేనేజర్స్ & ఇన్సూరెన్స్ మేనేజర్స్ కావలెను. P/T వర్క్ ఫ్రమ్ హోమ్, శాలరీ + ఇన్సెంటివ్ + కమిషన్, నో ఎగ్జామ్ ఇన్‌బోల్ జాబ్ స్త్రీ/పు. 9949839400

■ ఆఫీసులు, షోరూంలు, షాపింగ్‌మాల్స్, లి॥ కంపెనీల్లో 10th, ఇంటర్, డిగ్రీ, B.Tech చదివి ఖాళీగా ఉంటున్న వారికి మా సంస్థ ద్వారా ప్లేస్‌మెంట్స్,ఓన్లీఆఫీస్‌వర్క్. 8010597395, 9666257396

■ చేబ్రోలు, నారాకోడూరు, స్పిన్నింగ్ మిల్లు నందు అనుభవం కలిగిన సెక్యూరిటీ ఆఫీసర్, ASO మరియు సె॥ గార్డ్స్ కావలెను. డ్యూటీ॥ 12hrs, ఫ్రీ రూం సబ్సిడీ మీల్స్ కలవు. జీతం॥12k-16k, 6302252056

■ గుంటూరు నందు ప్రముఖ నర్సింగ్ కాలేజిలో పనిచేయుటకు వంటకి హెల్పర్స్ మరియు కారు, ఆటో నడుపుటకు డ్రైవర్ కావలెను. సంప్రదించండి. 8328003069, 8121821623

■ కృష్ణ సాయి క్లాత్ కారీస్ నందు పనిచేయుటకు హెల్పర్లు పురుషులు/స్త్రీలు కావలెను. ఆకర్షణీయమైన జీతం సంప్ర॥ అశోక్‌నగర్, 4/1, గుంటూరు. 9885513844

■ స్మైల్ డెంటల్ క్లినిక్స్ నందు పనిచేయుటకు EHS నందు అనుభవం కలిగిన డేటా ఆపరేటర్ కావలెను. బృందావన్ గార్డెన్స్, గుంటూరు. 8919067356

■ Wanted Marketing Executives, Data Entry Operators & Campus incharges to work in Sri Medha College located at Gnt. Salary based on experience. 9248746001

■ Urgent Need mother teachers, Pre primary teachers, Physics, Chemistry, English, Maths, Hindi Teachers for reputed school ✆ 8885356929

■ వెంటనే కావలెను. MNC, IT, Ltd కంపెనీల్లో డేటా ఎంట్రీ, రిసెప్షనిస్ట్, టెలికాలర్స్, సూ॥వైజర్స్, అకౌంటెంట్స్,ఆఫీస్‌ఎగ్జిక్యూటివ్స్, ఆఫీస్ బాయ్స్, హెల్పర్స్, అర్హత॥10th-PG, 7993976590

■ గుంటూరు సిటీలోని ప్రముఖ రియల్‌ఎస్టేట్ సంస్థ నందు డోర్ మార్కెటింగ్ చేయుటకు ఆసక్తి గల యువతి/యువకులు & టెలికాలర్స్ కావలెను. సంప్ర॥ 8121020347

■ డ్యూటి డాక్టర్స్ MBBS ఫార్మ్-డి, నర్సెస్ MPHW, GNM కావలెను. అహల్య నర్సింగ్ హోమ్, శివాలయం వెనుక, కొత్తపేట, గుంటూరు. 9246427459

■ Godrej interio wanted computer female operators age 20-25, sales executives male age 20-35. 7095951269

■ ప్రముఖ కంపెనీ నందు నిరుద్యోగ యువతీ/యువకులకు&జాబ్ చేస్తూ ఉన్నవారికి కూడా P/T, F/Tకలదు.P/T 12000, F/T 25000+comi+DA+TA అరండల్‌పేట,6/4,గుంటూరు ✆ 7386866833

■ Wanted Civil Engineers (BTech Civil) with a minimum of 2years experience M/s Tulasi Seeds Pvt. Ltd., Ameenabad, Guntur ✆ 9133842223, hr.manager@tulasigroup.com

■ యాడ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ప్రజాకాంక్ష దిన వార్తపత్రిక కు ఆంధ్రప్రదేశ్‌లో ఆసక్తి కలవారు సంప్ర: 8309402820, 9866813074, 9849072372

■ ప్రముఖ షోరూమ్ నందు పనిచేయుటకు అనుభవము కలిగిన సెక్యూరిటి గార్డ్స్ కావలెను. (మగ/ఆడ). ఆకర్షణీయమైన జీతం, గుంటూరు వారికి ప్రాధాన్యత. 9989893331, 8096481590

■ ఆర్క్ వెల్డర్స్, లైన్ షిఫ్టర్ ఆపరేటర్స్ కావలెను. సంప్రదించండి. ఇన్‌ఫ్యాబ్, Opp: చినకాకాని, మంగళగిరి మండలం, గుంటూరు జిల్లా. ✆ 92464 95788

■ నరసరావుపేట దగ్గర యలమంద ఊర్లో ప్రముఖ కంపెనీలో సె.గార్డ్స్, సె.సూపర్‌వైజర్లు కావలెను. Duty 8, 12 గం. జీ.11000, 10500. ఇన్సెంటివ్స్ + PF, ESI, భోజన వసతి. ✆ 73866 88787

■ మార్టూరు బాపట్ల జిల్లా శ్రీశారదానికేతన్ పబ్లిక్ స్కూల్ (CBSE) నందు అనుభవం కలిగిన టీచర్స్ M.A లిటరేచర్ B.A లిటరేచర్ ఇంగ్లీష్- 2 B.Sc. B.Ed Maths - 1 నర్స్-1 సెక్యూరిటీస్ -2 సైకాలజిస్ట్-1 అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్-1 కంప్యూటర్ ఆపరేటర్-1 జూనియర్ ఫిజిక్స్ లెక్చరర్-1 అర్జంటుగా కావలెను. ✆ 85001 44199

■ అర్జంటుగా దాచేపల్లి దగ్గర గల సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. రూం ఫ్రీ, తక్కువ రేటులో భోజనం. సంప్ర॥ 84648 35928, 6304488636, 9951680117

■ గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలలోని అన్ని మండలకేంద్రాలలో ECome Express లో పనిచేయుటకు Delivery boys కావలెను. సంప్ర॥ ✆ 89190 15932

■ రామకృష్ణ హోంకేర్ సర్వీసెస్ (AP NO-1) VJA, HYD శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, వంట/ ఇంటి పని, బేబీ కేర్ వర్కర్స్ కావలెను భో+వ+జీ: 15-21 వేలు ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 62812 08656, 62812 08600

■ ప్రముఖ హోమ్‌కేర్ సర్వీసెస్ హైదరాబాద్ లో వృద్ధులకు,పేషెంట్లకు సేవచేయుటకు, బేబీకేర్, ఇంటి/వంటపనికి స్త్రీ/పు కా॥. జీ: 16,000-25000/-రూం+భో॥ఫ్రీ. ఫోన్: 9390343785

■ డ్వాక్రా మహిళలు, రిటైర్డ్, నిరుద్యోగులు పెట్టుబడి పెట్టుకొని ఇంట్లో ఉంటూ కొవ్వొత్తులు, పెన్సిల్స్, పేపర్ ప్లేట్స్ చేసి ఇవ్వండి. డీక్లీ పేమెంట్, సబ్సిడీ లోన్స్ Ph: 9491993545

గుంటూరు
97030 13015
97034 67843
92904 02000

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వైఎస్సార్ సీపీ పదవుల నియామకం

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ డాక్టర్ విభాగం రాష్ట్ర కమిటీలో అవకాశం కల్పించారు. పల్నాడుకు జిల్లాకు చెందిన డాక్టర్ సనివరపు సాహిత్యను విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా, రాష్ట్ర కార్యదర్శులుగా డాక్టర్ గోపిరెడ్డి చిన్నపరెడ్డి, డాక్టర్ కె. శ్రీనివాసరెడ్డి, సహాయ కార్యదర్శిగా డాక్టర్ మేడికొండ పరమేశ్వరరెడ్డిలను నియమిస్తూ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

108లో ఈఎంటీ ఉద్యోగాలకు దరఖాస్తులు

నరసరావుపేట టౌన్: 108లో ఉద్యోగాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మేనేజర్ ఎస్.సుబ్బారావు సోమవారం తెలిపారు. 108 సర్వీస్‌లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్(ఈఎంటీ)గా పనిచేసేందుకు ఆసక్తి గల వారు పూర్తి బయోడేటా, విద్యకు సంబంధించిన సర్టిఫికెట్స్‌తో ఈ నెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. బీఎస్సీ బయాలజీ, బీజెడ్సీ, బీఎస్సీ నర్సింగ్, బయో కెమిస్ట్రీ, మైక్రో బయాలజీ, బి.ఫార్మసీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. వయసు 35 సంవత్సరాలు లోపు ఉండాలన్నారు. పూర్తి వివరాలకు 108 ఆఫీస్, పాత ప్రభుత్వ ఆస్పత్రి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం, పల్నాడు జిల్లా నరసరావుపేటలో సంప్రదించాలని కోరారు.

పోగొట్టుకున్న ఖరీదైన మొబైల్ ఫోన్ అప్పగింత


ఫోన్‌ను అప్పగిస్తున్న ఏఎస్పీ సుప్రజ, చిత్రంలో ఎస్ఐ శ్రీనాథ్, ఏఎస్ఐ రాందాస్‌రెడ్డి

నగరంపాలెం: ఖరీదైన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్న వ్యక్తికి గుంటూరు ఐటీ కోర్ (సైబర్ క్రైం) పోలీసులు తిరిగి అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. మంగళగిరి బెటాలియన్ కమాండెంట్ సుబ్బారెడ్డి మేనల్లుడు రఘురామిరెడ్డి ఖరీదైన సెల్‌ఫోన్ ఇటీవల పోగొట్టుకున్నారు. దీంతో అతను సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఐటీ కోర్ నోడల్ అధికారిణి, గుంటూరు ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ ఆధ్వర్యాన దర్యాప్తు చేపట్టారు. ఐఎంఈఐ ద్వారా హైదరాబాద్‌లో మొబైల్ ఫోన్ ఉన్నట్లు ఐటీ కోర్ ఎస్ఐ శ్రీనాథ్, ఏఎస్ఐ రాందాస్‌రెడ్డి గుర్తించారు. దాన్ని అక్కడ నుంచి తెప్పించి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో రఘురామిరెడ్డికి ఏఎస్పీ కె.సుప్రజ అందజేశారు. ఫోన్‌ను తిరిగి అప్పగించడంపై ఆయన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ పోటీలకు రాష్ట్ర డాడ్జ్ బాల్ జట్ల ఎంపిక


అసోసియేషన్ సభ్యులకు జ్ఞాపిక అందజేస్తున్న తులసీవిష్ణుప్రసాద్

కొల్లూరు: జాతీయస్థాయి సబ్ జూనియర్స్ డాడ్జ్ బాల్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిథ్యం వహించనున్న బాల, బాలికల జట్ల ఎంపిక ప్రక్రియ సోమవారం నిర్వహించినట్లు రాష్ట్ర డాడ్జ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొలసాని తులసీ విష్ణు ప్రసాద్ తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని చిలుమూరులోని శ్రీరామ రూరల్ విద్యా సంస్థల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న జట్లలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసినట్లు ప్రకటించారు. బాలుర విభాగంలో రాష్ట్రం తరఫున బాపట్ల జిల్లా నుంచి ఎం.ఈశ్వర్ మణికంఠ, వై.ఆనంద్, ఎంబీవీ క్రాంతి, ఎల్.సూర్యవెంకట్, ఎ.జశ్వంత్, ప్రకాశం జిల్లా నుంచి ఎం.విశ్వసాయి, జె. వీరపవన్ కుమార్‌రెడ్డి, ఎం.జస్వంత్, గుంటూరు జిల్లా నుంచి ఆనంద్ వర్ధన్‌రెడ్డి, ఎన్టీఆర్ కృష్ణా జిల్లా నుంచి అభిషేక్, నెల్లూరు జిల్లా నుంచి సీహెచ్. భావరిష్య, పి. శర్వర్యంలు ప్రధాన జట్టుకు ఎంపికవ్వగా, స్టాండ్ బైలుగా కృష్ణా జిల్లా నుంచి ఎం. తానయ్య, శివమణికంఠ, నెల్లూరు జిల్లా నుంచి పి. లోహిత్ కుమార్, బాపట్ల జిల్లా నుంచి ఎల్.యుగంధర్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో.. రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించడానికి ప్రకాశం జిల్లా నుంచి పి. సువర్ణలదేవి, డి.మధులహరి, ఎం.మహిత, టి.రేఖాతనూజ, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నుంచి పి.చరిత, టి.పూర్ణిమ, ఆర్.సుస్మిత, బాపట్ల జిల్లా నుంచి ఎం. చరిష్మ, పి. కీర్తన, ఇ. స్వప్న, కృష్ణా జిల్లా నుంచి వి. రిషిత, కె. ప్రవల్లికలు ప్రధాన జట్టుకు ఎంపికవ్వగా, స్టాండ్ బైలుగా బాపట్ల, ప్రకాశం, కృష్ణా జిల్లాలకు చెందిన ఇ. నాగవైష్ణవి, కావ్యశ్రీ, సీహెచ్. పవిత్ర, ఎం. చంద్రికలు ఎంపికయ్యారు. రాష్ట్రానికి ఎంపికైన బాల, బాలికల జట్లు నవంబర్ నెలలో వారణాసిలో జరగనున్న జాతీయ పోటీలలో పాల్గొననుండగా, ఇరు జట్లకు చిలుమూరులో త్వరలో కోచింగ్ క్యాంప్ ఏర్పాటు చేసి శిక్షణ నిర్వహించనున్నట్లు డాడ్జ్ బాల్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

విద్యుత్ బిల్లుల్ని ప్రభుత్వమే చెల్లించాలి

హెచ్ఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.రమణ


మాట్లాడుతున్న రమణ

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల విద్యుత్ బిల్లులను నేరుగా ప్రభుత్వమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘ (హెచ్ఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.రమణ విజ్ఞప్తి చేశారు. బ్రాడీపేట రెండో లైనులోని హెచ్ఎంఏ జిల్లాశాఖ కార్యాలయంలో సోమవారం సంఘ గుంటూరు జోన్ ప్రాంతీయ సమావేశాన్ని నిర్వహించారు. రమణ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రధానోపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కార నిమిత్తం ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నట్లు చెప్పారు. నాడు-నేడు పనులు, ఎండీఎం నిర్వహణ, పాఠశాలల నిర్వహణ గ్రాంట్లు సకాలంలో విడుదల కాకపోవడం, విద్యుత్ బిల్లుల అంశాలపై చర్చించారు. పాఠశాలల నిర్వహణ గ్రాంట్లను నూరుశాతం విడుదల చేయాలని, ఎఫ్ఏ-2, ఎఫ్ఏ-4 ప్రశ్నాపత్రాల్ని డీసీఈబీల ద్వారా ముద్రించి పాఠశాలలకు సరఫరా చేయాలని కోరారు. ప్రతి ఉన్నత పాఠశాలకు బోధనేతర సిబ్బందిని నియమించాలని, సబ్జెక్టు ఉపాధ్యాయుల కాంప్లెక్స్‌లను రోజుకు ఒక గంటపాటు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. విధి నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులు, సమస్యలను పరిష్కరించడంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు చొరవ చూపాలని కోరారు. సమావేశంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కోశాధికారి సీవీవీ సత్యనారాయణ, గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఆవుల తిరుమలేష్, ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

8న బీసీ సంక్షేమ సంఘ రాష్ట్రస్థాయి సమావేశం


మాట్లాడుతున్న కేసన శంకరరావు

నెహ్రూనగర్: ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 8న రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం తాడేపల్లిలో నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల అభ్యున్నతే ధ్యేయంగా సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బీసీ భవన్ నిర్మాణం, మహిళ బిల్లులో ఓబీసీలకు 33శాతం వాటా, జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో పటిష్ట సంఘ నిర్మాణం, సభ్యత్వ నమోదు తదితర అంశాలపై తాడేపల్లిలోని ఓ హోటల్‌లో సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో సంఘ నాయకులు కుమ్మర క్రాంతికుమార్, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, కోలా అశోక్, ముప్పాన వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రి ఆదర్శనీయులు

రేపల్లె: అహింసా సిద్ధాంతంతో జాతిపిత మహాత్మా గాంధీ దేశానికి స్వాతంత్య్రం తీసుకొస్తే, జై జవాన్-జైకిసాన్ నినాదంతో దేశాభివృద్ధికి లాల్ బహదూర్ శాస్త్రి చేసిన సేవలు ఎనలేనివని రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షులు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మహాత్మాగాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రిల జయంతి కార్యక్రమాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి, అనేక ఉద్యమాలు నిర్వహించి దేశ స్వాతంత్య్రసిద్ధి పొందేందుకు కృషి చేసిన మహాత్మా గాంధీని ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. ఆయన శాంతి అహింసా మార్గాలను నేడు ప్రపంచ మానవాళి ఆచరిస్తున్నాయన్నారు. దేశ స్వాతంత్య్ర సిద్ధి కోసం తనవంతు సేవలు అందించి స్వాతంత్య్ర అనంతరం పాలనలో అనేక పదవులు నిర్వహించి, ఆ పదవులకే వన్నె తీసుకురావటంతో పాటు ప్రధానమంత్రిగా దేశాభివృద్ధికి నిరంతరం కృషి చేసిన లాల్ బహదూర్ శాస్త్రి మరో ఆణిముత్యమన్నారు. ఇండో-పాక్ యుద్ధ సమయంలో దేశాన్ని సమర్థంగా నడిపి శాస్త్రి పలువురికి ఆదర్శప్రాయుడిగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా పూజ్య గాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథ గుప్త పాల్గొన్నారు.